**1992 న్యూజెర్సీ తెలుగు కళాసమితి వారి కథల పోటీలో రూ. 200/-లు బహుమతి పొందిన కథ**

# ఆడపిల్ల — ఆత్మగౌరవం



— వడ్లమూడి దుర్గాంబ

"ఛీ! ఛీ! మిమ్మల్ని నమ్ముకుని ఇంతదూరం రావడం నాదే బుద్ధి తక్కువ.

ఈ విషయం ముందే లెటర్ రాస్తే అసలు రాకపోదును గదా! 'మా పుట్టింటి వారికి గతిలేదు. అదేదో మీరే చేసెయ్యండి' అని మా అత్తగార్నే బతిమాలుకునే దాన్ని..."

ప్రవాహంలా సాగిపోతోంది కస్తూరి వాగ్ధోరణి. "అది కాదమ్మా కొంచెం నిదానంగా విను తల్లీ..." రామచంద్రయ్య నిదానంగా బుజ్జగిస్తున్నట్టుగా అన్నాడు. కూతురి మాటలు ఆయన మనసుని ముళ్ళలా గాయపరుస్తున్నాయి.

"కస్తూరీ! డబ్బుంటే మీ నాన్నగారెప్పుడన్నా నీ ముచ్చట కాదన్నారా! ఆయనకి నువ్వంటే ఎంత ప్రాణమో నీకు తెలీదా! అన్నీ తెలిసిన దానివి. చదువుకున్న దానివి. ఆ మాత్రం అర్థం చేసుకోకపోతే ఎలాగమ్మా ..." తల్లి అనునయంగా చెబుతోంది. తల్లీ దండ్రీ తనను శాంత పరిచేందుకు ప్రయత్నించిన కొద్దీ కస్తూరిలో కోపం తారాస్థాయి చేరుకుంటోంది. ఇక తాము మాట్లాడితే ఇంకేం వినవలసి వస్తుందోనని భయపడి మౌనంగా నిలబడి చూస్తున్నారు కస్తూరి అన్నా వదినా.

కస్తూరికి ఇద్దరే ఆడపిల్లలు. పైగా కవల పిల్లలు. వాళ్ళకి పన్నెండో ఏడు రావడంతో సంప్రదాయం ప్రకారం పుట్టింట్లో ఓణీ వేయించి తీసి కెళ్ళేందుకు - మూడు రోజుల క్రితమే పిల్లల్ని తీసుకుని దిగింది కస్తూరి.

కస్తూరి తమకి ఒక్కటే కూతురు - ఆమెకి ఇద్దరే ఆడపిల్లలు - పైగా కస్తూరి అత్తగారు బాగా వున్నవాళ్ళు - ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టు

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

కుని - ఈ సందర్భంగా పిల్లలకీ, కస్తూరికీ పట్టుబట్టలు పెట్టాలని ఎప్పట్నించో అనుకుంటున్నారు రామచంద్రయ్య దంపతులు. కానీ అనుకోకుండా ఈ సంవత్సరం - పంటలు సరిగ్గా చేతికి రాకపోవడం - కస్తూరి అన్న కొడుకులిద్దరూ వేరే వూళ్ళలో కాలేజీల్లో చేరాల్సి రావడం మూలాన కస్తూరి ముచ్చట తీర్చేందుకు శక్తి లేకపోయింది రామచంద్రయ్యకి.

"పట్టుబట్టలు వచ్చే ఏడు పెడతాను. ఈ పని జరిగిపోడానికి ఏదో మామూలు బట్టలు కట్టుకెళ్ళమ్మా" అని ఆయన అడిగినందుకు కస్తూరి చేస్తోన్న రాద్ధాంతం ఇది!

ఆమెకి లోపలినుంచి కోపం, ఉక్రోషం, ఆవేశం తన్నుకొస్తున్నాయి. రేప్పొద్దున తోడికోడళ్ళ ముందు తనెలా తల ఎత్తుకోవాలి? అత్తగారింట్లో తన పరువూ-మర్యాదా-ఆత్మగౌరవం-ఇవన్నీ ఏం కావాలి? ఆడపిల్ల అయినందుకు తనకు పుట్టింట్లోనే చిన్న చూపు! ఇక అత్తగారింట్లో ఆత్మగౌరవం గురించి ఆలోచించడం ఎందుకు?

కస్తూరి మౌనం అందర్నీ బాధిస్తోంది.

"కస్తూరీ! అలా కోపం తెచ్చుకోకమ్మా! నాన్నగానీ, నేనుగానీ ఎప్పుడైనా నువ్వడిగింది కాదన్నామా? ఏదో పరిస్థితులు ఇలా వచ్చాయి. పైగా నీ మేనల్లుళ్ళిద్దరూ పై చదువులకి వెళ్ళాల్సి రావడం ... చదువుకున్న దానికి ఆ మాత్రం అర్థం చేసుకోలేకపోతే ఎలాగమ్మా..." కస్తూరి అన్న నిదానంగా నచ్చచెబుతున్నాడు. అతను చదువుకోలేదు. చిన్నప్పట్నించి తండ్రికి పొలం పనుల్లో సాయం చేస్తూ చెల్లెల్ని చదివించాడు.

కస్సుమంది కస్తూరి మళ్ళీ.

"అవును చదివించారు! ఆడపిల్లని చదివించగానే అన్ని సమానత్వాలూ ఇచ్చేసినట్టు మాట్లాడతారు. డబ్బుల్లేవని నీ కొడుకుల చదువులాగినయ్యా - నా పిల్లలకి జరగాల్సిన ముచ్చట ఆగుతోందిగానీ - రేప్పొద్దున ఆస్తంతా నువ్వొక్కడివేగా అనుభవించేది. నేనెప్పుడన్నా ఓ జాకెట్ ముక్కా, చీరా పట్టుకెళ్ళేదాన్నే గాని నీతో సమానంగా ఆస్తిలో వాటాకొస్తున్నానా... ఆడపిల్లనేగా మీకందరికీ ఇంత చులకన?"

కస్తూరి అన్న తెల్లబోయాడు. ఆమె అలా మాట్లాడుతుందని అనుకోలేదు అతను. ఆస్తంతా తనే అనుభవిస్తున్నాడట - నిజానికి - కస్తూరి చదువుకీ, పెళ్ళికీ అయిన ఖర్చులో సగం కూడా వుండదు - తనకి మిగిలిన ఆస్తి. ఇక ఆమెతో మాట్లాడ్డం అనవసరం అన్నట్టుగా అక్కడ్నించి వెళ్ళిపోయాడతను.

"రేపు వెళ్ళిపోతాను నేను" వున్నట్టుండి అంది కస్తూరి. ఎవ్వరూ మాట్లాడలేదు....

మాట్లాడినా ప్రయోజనం వుండదని అందరికీ తెలుసు. ఇల్లంతా స్తబ్దం అయిపోయింది.

కూతురు వెళ్ళే వేళకి ఏమైనా పిండి వంటలన్నా చేయాలని హడావుడి మొదలుపెట్టింది కస్తూరి తల్లి రామలక్ష్మి. తమ పాలేరు భార్య సావిత్రీ, ఆమె కూతురు సీత వచ్చారు పనుల్లో సాయం చెయ్యడానికి. కస్తూరి ముభావంగానే ఇంట్లో తిరుగుతోంది. పిల్లల్ని కూడా తాతయ్యా అమ్మమ్మ దగ్గరకి వెళ్ళనివ్వడం లేదామె.

ఆ సాయంత్రం కస్తూరి పెరట్లో నూతి చప్టా మీద కూర్చుని పిల్లలకి జడలు వేస్తోంది. కొంచెం అవతలగా సీత పిండి కొడుతోంది. వాళ్ళమ్మ జల్లెడ పడుతోంది. సీతకి కూడా ఈ మధ్యే పెళ్ళయింది. 'ఇంత చదువుకున్నదాన్ని, స్త్రీ స్వేచ్ఛా సమానత్వాల గురించి పూర్తి అవగాహన వున్న దాన్ని - నాకే పుట్టింట్లో గౌరవం లభించడం లేదు. ఇక ఇలాంటి చదువూ సంధ్యా లేని ఆడపిల్లల గతేంటి?...' సీతని చూసి అనుకుంటోంది కస్తూరి.

"ఏమ్మా అమ్మాయిగారు అప్పుడే వెళ్ళిపోతున్నారు?" సావిత్రి అడిగింది. రామలక్ష్మి ఉలిక్కిపడింది. "ఏం లేదు! అల్లుడుగారు అర్జంటుగా ఏదో వూరు వెళ్ళాలట. రమ్మని ఉత్తరం ఇస్తేనూ ..." అని అసలు విషయం దాటేస్తూ "అవునే సావిత్రీ సీతకి పెళ్ళి చేశావు. అది పుట్టినకాడ్నించీ కష్టపడుతూనే వుంది. ఆ అత్తింట్లో ఏం సుఖపడుతూందో ఏమో! నాలుగు రోజులు హాయిగా గడపడానికొస్తే దానిచేత అడ్డమైన చాకిరీ చేయిస్తావేమిటే! నేను చూస్తూనే వున్నా - అది వచ్చిన కాడ్నించి పన్లోకి వెళ్తూనే వుంది" తన కూతురి గురించిన మాట మార్చి సావిత్రి కూతురి గురించి అడుగుతోంది రామలక్ష్మి.

"బాగుందమ్మా! దానిని పనిచెయ్యమని నేమంటామా! చూసినోళ్ళిలాగే అనుకుంటారు. మరి ..." రామలక్ష్మి, కస్తూరీ కూడా ఆశ్చర్యపోయారు సావిత్రి మాటలకి. "మరి నీకేం రోగమే - హాయిగా తిని కూర్చోక -" రామలక్ష్మి కొంచెం నవ్వుతూ అంది. సీత పిండి కొట్టడం ఆపింది. ఆమె చేతిలోంచి రోకలి, సావిత్రి అందుకుంది. "ఆళ్ళకోసం గాదమ్మా! నా కోసం నేనెల్తున్నా కూలికి -" సీత మాటలు అర్థం కాలేదు తల్లీకూతుళ్ళిద్దరికీ.

"మేం ఒక్క చీరా రవికా కూడా కొనిపెట్టలేనోళ్ళమన్నట్టు - ఈ నాల్గు రోజులూ కష్టపడి తన డబ్బుతో తనే కొనుక్కెల్తదంటమ్మా - చీరా రైకా -" కొంచెం విసుగ్గారంగా చెప్పింది సావిత్రి. "అది గాదమ్మా! ఇప్పుడు నా కోసం ఈళ్ళు వందో రెండొందలో ఖర్చు పెడతారు. వద్దంటే వినరు. ఆదే నా ఖర్చుకి నేనే సంపాదించుకుంటే, నాకు పెట్టే డబ్బుల్తో నెల రోజులు కూర్చుని తినొచ్చు మా అమ్మా, అయ్యా. పుట్టింటి నుంచీ కోక కట్టుకు రాకపోతే మా అత్తా మామా ఆడబిడ్డలు అందరూ చిన్న చూపు చూస్తారు. నన్నంటే బాధ లేదు. మీ అమ్మా అయ్యా గతి లేనోళ్ళని ఆళ్ళని కూడా తిడతారు. అందికే ఈ నెల రోజులు ఓపినంత కష్టం జేసుకుని నేనే జత కోకలు కొనుక్కెల్తాను..." సీత చెప్పడం ఆపింది.

కస్తూరి తెల్లబోయింది. ఆమెలో అంతవరకూ పౌరుషాన్ని రెచ్చగొడుతున్న 'ఆత్మగౌరవం' కొత్త అర్థంలో కనబడుతోంది. తల్లిదండ్రుల్ని పీడించుకు తిని తన ఆత్మగౌరవం కాపాడుకోవాలనుకుంటోంది తను! కానీ సీత? ఆత్మగౌరవం అనే పెద్ద మాటకి అర్థం తెలియకపోయినా - తల్లిదండ్రులకు భారం కాకుండా తన గౌరవం - పుట్టింటి గౌరవం నిలబెట్టుకుంటోంది ...! సీత జల్లెడ పడుతున్న పిండిలా కస్తూరి ఆలోచనలు మెత్తగా - తెల్లగా - స్వచ్ఛంగా సాగుతున్నాయి. ☆

